
మంగపేటలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

మంగపేట, డిసెంబర్ 8 : మండల కేంద్రంలోని పలు వార్డుల్లో శుక్రవారం పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పీహెచ్‌సీ, తహసీల్ కార్యాలయం, సెంటర్, గంపోనిగూడెం, మెయిన్ రోడ్డు, పొదుమూరు, ముస్లిం వీధి తదితర ప్రదేశాల్లో సైడ్ డ్రైన్ల శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు లేని నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి సమన్వయంతో పనులు చేయాలన్నారు. ప్రజలకు పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలన్నారు. పారిశుధ్యం, వీధిలైట్లు, తాగు నీరు వంటి సమస్యలు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని సూచనలిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ..


వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు, డిసెంబర్ 8 : మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం పేరూరు ఎస్సై జీ రమేశ్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీజేశారు. వివిధ ప్రాంతాలకు వచ్చిపోయో వాహనాలను ఆపి బ్యాగులు తీసి సోదాలు చేశారు. అనుమతి పత్రాలు కలిగి, లేని వాహనదారులకు జరిమానాలను విధించారు.

### వాజేడులో..

వాజేడు, డిసెంబర్ 8 : మండలంలోని కొంగాల గ్రామ పంచాయతీలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద ఉన్న హైదరాబాద్ టూ భూపాలపట్నం 163 జాతీయ రహదారిపై శుక్రవారం వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ఆపి బ్యాగులు తీసి సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి, అనుమతి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

## ఉన్నతిని పకడ్బందీగా అమలు చేయాలి

ములుగురూరల్, డిసెంబర్ 8 : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉన్నతి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పకడ్బందీగా అమలు చేయాలని టీఎస్ఆర్ఎస్ రాష్ట్ర సెక్రటరీ రమణకుమార్ సూచించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని బండారుపల్లి, జవహర్‌నగర్ మోడల్ స్కూళ్లను ఆర్‌జేడీ సత్యనారాయణ, డీఈవో పాణినీలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలను బోధించే సమయంలో ఉన్నతి సోపానాలను అనుసరించి బోధన చేపట్టాలన్నారు. వారి వెంట ఉపాధ్యాయులు, ఇతర అధికారులు ఉన్నారు.

## రామప్పను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని వినతి

వెంకటాపూర్, డిసెంబర్ 8: మండలంలోని పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని కోరుతూ రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి వెంకట రామ్మోహన్‌రావు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రం

రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన శిల్పకళా ఖండమైన రామప్పగుడిని అభివృద్ధి చేయాలని కోరారు. వారు సమర్పించిన వినతిపత్రంలో రామప్ప చుట్టూ 50 కిలోమీటర్లు బఫర్ జోన్‌గా గుర్తించాలన్నారు. సింగరేణి ఓపెన్ కాస్టు మైనింగ్ అనుమతించరాదనీ, రామప్ప ఆల యం చుట్టూ ఉన్న అనుబంధ దేవాలయాలను పునర్నిర్మాణం చేయాలని, విదేశి యా త్రికుల కోసం మినీ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలన్నారు. రామప్ప చెరువు కట్టను 200 మీటర్లు వెడల్పు చేసి, సుందరీకరణ చేయాలన్నారు. రామప్ప చెరువు మధ్యలో గల ఐలాండ్ వరకు రోప్‌వే నిర్మించాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాలంపేట గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నారు. పాలంపేట గ్రామంలోని నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామస్తులు వ్యాపారాలు చేసుకోవడానికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు.

# టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలి

**అడిషల్ కలెక్టర్ వేణుగోపాల్**


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్

మంగపేట, డిసెంబర్ 8 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా టార్పాలిన్ షీట్లును అందుబాటులో ఉంచాలని ములుగు అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ స్థానిక అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని బోరునర్సాపురం, వాడగూడెం, రాజుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రధానంగా రైతులు అమ్మకాల కోసం తీసుకొచ్చిన ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. బండారిగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి అరవింద్‌రెడ్డి, పౌర సఫరాల సంస్థ డీఎం రాములు, మంగపేట పీఏసీఎస్ సీఈవో జగన్నాథరావు, డైరెక్టర్ గంటా సునీతారామారావు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.


మంగపేట : ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

# తగ్గిన వర్షం.. రైతులకు ఊరట


గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట, డిసెంబర్ 8 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం రాశులు తడిచిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి ఒక్క సారిగా వర్షం తగ్గి ఎండ రావడంతో రైతులు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. వర్షం తగ్గడంతో రైతులు కాస్త ఊరట చెందారు. మరో 2 రోజుల పాటు వర్షం ఉంటే ధాన్యం మొలకలు వచ్చే పరిస్థితి పూర్తి స్థాయిలో ఉండగా, ఇప్పటికే కొన్ని ధాన్యం రాసుల్లోకి నీళ్లు వెళ్లి మొలకలు సైతం రావడంతో రైతులు ఇబ్బందులు పడుతూ మళ్లీ ఆరబెట్టుకుంటున్నారు.

### మంగపేటలో..

మంగపేట: తుఫాన్ ప్రభావతంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురు తగ్గడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాను హెచ్చరికలు వినగానే రైతులు హార్వెస్టర్లతో కోసిన ధాన్యాన్ని పచ్చిగా ఉండగానే తడువకుండా రాశులుగా పోసి టార్పాలిన్ కవర్లు కప్పుకొని జాగ్రత్త పడ్డారు. చాలా మంది రైతు ల ధాన్యం తడిసిపోయింది. అయితే శుక్రవారం వర్షం తగ్గి ఎండ వాతావరణం ఏర్పడంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం కప్పులను ఆరబోసే పనిలో పడ్డారు. మిర్చి రైతులు మొక్కలు దెబ్బతినకుండా తోటల్లో నిలిచిన నీటిని బయటకు పంపి తగిన జాగ్రత్తలు పాటిస్తున్నారు. మండలంలో ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్న క్రమంలో కురిసిన వర్షానికి పొలాలు బురదమయంగా తయారు కావడంతో కోత మిషన్ల ద్వారా పని వీలుకాక వరి కోతలు నిలిచిపోయాయి. ఓమూడు రోజుల పాటు వాతావరణం అనుకూలంగా ఉంటే మళ్లీ వరి కోతలు యథావిధిగా జరుగుతాయని రైతులు చెబుతున్నారు.

# యువత దేశ సేవలో భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న డీఈవో పాణిని

ములుగురూరల్, డిసెంబర్ 8 : యువత దేశ సేవలో భాగస్వాములు అయ్యేందుకు అగ్నివీర్, అగ్నిపత్ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పాణిని సూచించారు. శుక్రవారం ఆయన బండారుపల్లి టీఎస్ఆర్ఎస్, ఇంచర్ల టీటీడబ్ల్యూఆర్ఎస్, ములుగు ఏజీబీవీ గురుకులాల్లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ న్యావి ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వారి ఉజ్వల భవిష్యత్ కోసం సైన్యంలో చేరాలని తెలిపారు. ఉద్యోగంతో పాటు దేశ సేవలో భాగస్వాములు కావాలనుకునే వారు ఈ ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ రాజేశ్, మిశ్రా, జిల్లా ఉపాధి అధికారి కుమారస్వామి, ఉపాధ్యాయులు విక్రమ్‌రాజ్, సాంబయ్య, విజేందర్ పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగురూరల్, డిసెంబర్ 8 : ములుగు, వెంకటాపూర్ మండలాల్లో నేడు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు మండలంలోని ములుగు, పత్తిపల్లి, మల్లంపల్లి, అబ్బాపురం, రామచంద్రాపురం, పందికుంట, వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట, వెంకటాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో సబ్ స్టేషన్ మరమ్మతు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నందున వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

## మంత్రిని కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు


మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ములుగురూరల్, డిసెంబర్ 8 : ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీతక్కను ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు మడుగురి నాగేశ్వర్‌రావు, జాయింట్ కన్వీనర్ మధుసూదన్, కన్వీనర్ అన్నవరం రవికాంత్, సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు గట్టు సంజీ వ, హట్కర్ సమ్మయ్య, జనగాం బాబురావు, మంకిడి రవి, బర్మావత్ శ్రీను పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తరలింపు

వేలేరు, డిసెంబర్ 8 : మండలంలోని మల్లికుదుర్ల శివారు ప్రభుత్వ భూముల్లో నుంచి కొంత మంది అక్రమంగా మొరం తరలిస్తున్నారు. చెట్లను సైతం తొలగించి మొరం తరలిస్తున్నారు. పెద్దఎత్తున మొరం మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని రోజులుగా మల్లికుదుర్ల, ధర్మసాగర్ మండలం కుషాయిగూడేనికి చెందిన కొంత మంది మొరం తరలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని చుట్టుపక్కల రైతులు కోరుతున్నారు.